
నార్సింగిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్



మణికొండలో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న కౌన్సిలర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు


గణేష్‌నగర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


హైదర్‌గూడ చౌరస్తాలో...

ఆదర్శ మహిళ సావిత్రీబాయి పూలే

- సావిత్రీబాయి అడుగు జాడల్లో నడవాలి
- ఆమె ఆశయ సాధన దిశగా సాగాలి
- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్
- పలు ప్రాంతాల్లో పూలే చిత్రపటాలకు నివాళి
- ఉపాధ్యాయినులకు ఘనంగా సన్మానం

మణికొండ: తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసి అందరికీ స్ఫూర్తిగా, ఆదర్శ మహిళగా సావిత్రీ బాయి పూలే నిలిచారని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా నార్సింగి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిమ సింగ్ మాట్లాడుతూ... మహిళలపై అనేక ఆంక్షలు ఉన్న సమయంలో వారు చదువుకోవాలని, సమాజంలో అందరూ సమానంగా జీవించాలని ఆమె పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కుల వివక్షను విడనాడాలని, విద్యతోనే మహిళలు రాణిస్తారని నమ్మి తన సిద్ధాంతాలు, ఆశయాల సాధనకు అవిశ్రాంతంగా పోరాడి సాధించిన సావిత్రీ బాయి పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె అడుగు జాడల్లో పయనించి నేడు ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ప్రతిమ సింగ్ స్పష్టం చేశారు. సావిత్రీ బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించటం శుభ పరిణామం అని అన్నారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి సత్కరించారు. నార్సింగిలో జరిగిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ సన్మానించారు.

గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు సావిత్రీబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకొని ఆమె అడుగు జాడల్లో నడవాలని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పాఠశాలలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాధవి మాట్లాడుతూ... ఆధునిక భారతావనిలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల విద్యాభివృద్ధి వారి హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన తొలి తరం ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి అని కొనియాడారు. ఆమె అడుగు జడల్లో నడుస్తూ... ఆమె ఆశయ సాధన దిశగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు లక్ష్మీబాయి, జ్యోత్స్న, శిరీష, మాణిక్యం రెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


నార్సింగిలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న కౌన్సిలర్ ప్రవీణ్

పద్మశాలీపురంలో...

మహిళల అభ్యుదయం కోసం అహర్నిశలు శ్రమించి వారి విద్యాభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సాయి గ్రామర్ హై స్కూల్ హెచ్‌ఎం శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని పద్మశాలీపురంలోని సాయిగ్రామర్ హై స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావుపూలే సతీమణి బాలికా విద్య కోసం విశేష కృషి చేసిన సావిత్రీబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం సంతోషించదగ్గ విషయమన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై సావిత్రీబాయి పూలే చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ ఎ.పి.చారి, డైరెక్టర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ఫణివిజ్ఞాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదర్‌గూడ చౌరస్తాలో ...

అత్తాపూర్: భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని


సాయిగ్రామర్ హై స్కూల్‌లో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

పలువురు నాయకులు కొనియాడారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ చౌరస్తాలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జ్యోతిరావు పూలే విగ్రహ వద్ద చదువుల తల్లి సావిత్రీ బాయి పూలే జయంతిని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, సలహాదారులు డాక్టర్ శ్రీరాములు, బీసీ నాయకులు కోలమీది యాదయ్య, నయీమ్, భిక్షపతి, మల్లికార్జున్, శ్రీనివాస్ యాదవ్, రాధాకృష్ణ, దళిత నాయకులు వీర్లపల్లి నవీన్, క్రాంతి కుమార్, మల్లేష్, బర్ల సుమన్, కె.గౌతమ్, పత్యార నర్సింహ పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో...

అత్తాపూర్: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరై సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్, ఉపాధ్యాయులు సాయిప్రసాద్‌రావు, సుజాత, రోజారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ శంకర్‌రాథోడ్

శివరాంపల్లి పాఠశాలలో...

సావిత్రీబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శివరాంపల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పని చేస్తున్న 27 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓ శంకర్ రాథోడ్, ప్రధానోపాధ్యాయులు కిషన్ జీ, ఉపాధ్యాయినులు రూపాదేవి, మహేశ్వరి, యామిని, ఉదయలక్ష్మీ, ప్రమిద, సులక్షణ, కవిత, వసుంధర, పద్మ, జ్యోతి, నాగమణి, సునీత, శ్రీదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యాయులు సుదర్శన్, నరసింహ చారి, జనార్దన్ చారి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ ప్రాథమిక పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కిషోర్, సరిత, రమేష్, నాయకులు నర్సింహ, రమేష్‌పటేల్, మహేష్, బాలు, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీలో...

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ పాల్గొని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, రమణ, ప్రసాద్, భూపాల్, శ్రీనివాసరావు, డీఎస్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ అకాడమీలో డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు


శంషాబాద్ పిల్లోనిగూడలో...

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు



శంషాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌ని సత్కరించారు. దళితుల అభ్యున్నతికి అధిక నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా నరేందర్ కోరారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డి.కొండల్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నేతలు మహేష్‌రాజ్, జి.గట్టయ్య, బి.శ్రీనివాస్‌గౌడ్, మైపాల్, విజయ్‌కుమార్, ప్రశాంత్‌గౌడ్, వెంకటేష్, కె.శంకర్, భాస్కర్, పాండు, చైతన్య రెడ్డి, అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విడుదల చేసిన పోస్టర్‌ను కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. అన్ని డివిజన్‌ల పరిధిలోని రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాలలో చెత్త పారవేయడం కానీ కాల్చడం గానీ చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారిపై తగు జరిమానా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేనేజర్ మంజులత, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్‌గూడ సర్వే నంబర్: 54లో ప్రభుత్వ బోర్డుల ఏర్పాటు


ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ నాటిన బోర్డులు

శంషాబాద్: కొత్వాల్‌గూడ సర్వే నంబర్ 54లో యాభై రెండు ఎకరాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ బోర్డులు పాతారు. సర్వే నంబర్ 54 సుమారు 52 ఎకరాల భూమి ఏళ్లతరబడి వివాదాస్పదంగా ఉంది. ప్రభుత్వం తమ భూమిగా పేర్కొంటుండగా కొందరు ప్రైవేటు వ్యక్తులు హిమాయత్ సాగర్‌లో భూమిని కోల్పోయి గాలయ్య అనే వ్యక్తికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమిని అతడి వారసుల ద్వారా కొనుగోలు చేసినట్లు పేర్కొంటూ కోర్టులో పోరాడుతున్నారు. జిల్లా కోర్టు ఇటీవల ఈ భూమికి సంబంధించిన అప్పీలును స్వీకరించింది. సంబంధిత భూములను రెవెన్యూ అధికారులు తమ పరిధిలోకి తీసుకోవాలని ప్రభుత్వ న్యాయవాది సూచనల మేరకు బోర్డులు పాతి తమ పరిధిలోకి తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రవీందర్ దత్ తెలిపారు.

నిర్మాణంలోని హైరైజ్ టవర్‌లో మంటలు


టవర్ నుంచి వస్తున్న దట్టమైన పొగలు

మణికొండ: కోకాపేట నియోపొలిస్ వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న మై హోం టవర్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు లేచాయి. నిర్మాణ పనుల్లో ఉన్న సిబ్బంది నీటిని వేడి చేసుకునే గ్రీజర్‌లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎక్కువగా వాడటంతో వైర్లు కాలిపోయి మంటలు లేచాయి. అక్కడే వైర్ల కుప్ప ఉండటంతో దానికి మంటలు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు, పొగలు లేచాయి. గమనించిన అక్కడి సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. విద్యుత్ వైర్లు కాలిపోవటంతోనే ప్రమాదం జరిగిందన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలలో వందలాది మంది కార్మికులు నివసిస్తున్న చోట అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారి సూచించారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి


సబితాఇంద్రారెడ్డిని కలిసిన మణికొండ బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మార్చిలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని, ఆయా ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మరో రెండు నెలల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అనేక మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. అలా పార్టీలు మారి వచ్చే వారికంటే పార్టీని నమ్ముకుని ఉన్న వారికే రాబోయే ఎన్నికల్లో టికెట్‌లను కేటాయిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు జి.నరేందర్, మాల్యాద్రినాయుడు, విఠల్, రాజేంద్రప్రసాద్, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, విజయలక్ష్మి, రాంసుబ్బారెడ్డి, షేక్ ఆరీఫ్, శ్రీధర్, సుమ, రేఖ, అనూష, మంజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం కలిసి రావాలి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

మణికొండ: కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ కలిసి రావాలని, ప్రజలంతా ఆనందోత్సాహాలతో జీవించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తలారి మల్లేష్, వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్, డైరెక్టర్‌గా ఓం ప్రకాష్‌రెడ్డిని నియమించటంతో వారు శుక్రవారం ఆయనను నార్సింగిలోని తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ నేత మాట్లాడుతూ... గుడిమల్కాపూర్ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయటంతో పాటు పూల రైతులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని వారికి సూచించారు.


మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన గుడిమల్కాపూర్ మార్కెట్ పాలక కమిటీ నాయకులు

చెస్ విజేత నిదీష్‌కు ఘన స్వాగతం


నిదీష్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

శంషాబాద్: మహారాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూణేలో నిర్వహించిన 37 జాతీయ చెస్ చాంపియన్ షిప్ అండర్-9 పోటీల్లో చాంపియన్‌షిప్‌ను సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన నిదీష్ శ్యామల్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. లిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామరాజు అతడిని సన్మానించి ప్రశంసించారు. చెస్‌లో రాణించిన నిదీష్ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

నియామకం


మోహన్‌రావు

శంషాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడుగా పోశెట్టిగూడకు చెందిన మంచర్ల మోహన్‌రావును నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జారీ చేసిన నియామకపత్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నేత పి.కార్తీక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్ బి.సతీష్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, నాయకులు రాజేందర్, శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నీలో రాణించిన జిల్లా రెజ్లర్లు


పతకాలు సాధించిన రెజ్లర్లతో కోచ్ శ్రీకాంత్‌యాదవ్

మణికొండ: హన్మకొండ జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన రెజ్లర్లు తమ సత్తాచాటి పతకాలను సాధించారు. డిసెంబర్ 31వ తేదీ నుంచి శుక్రవారం వరకు జరిగిన పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో ఏడు పతకాలను సాధించారు. అందులో 51 కేజీల విభాగంలో సన్నీహేమంత్, 55 కేజీల విభాగంలో రాజు బంగారు పతకాలను సాధించారు. 70 కేజీల విభాగంలో సందీప్, 74 కేజీల విభాగంలో జె.విజయ్ సిల్వర్ మెడల్‌లను సాధించారు. 60 కేజీల విభాగంలో మోహన్, 57 కేజీల విభాగంలో టి.అరవింద్, 61 కేజీల విభాగంలో ఎస్.ప్రణవ్, 65 కేజీల విభాగంలో వినయ్‌లు బ్రాంజ్ మెడల్‌లను సాధించారని కోచ్ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

నేటి నుంచి మున్సిపల్ కార్యాలయాల ఎదుట 48 గంటల ధర్నా

బండ్లగూడ: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయాల ఎదుట శని, ఆదివారాల్లో 48 గంటల పాటు ధర్నాను నిర్వహించనున్నట్లు సీపీఎం సీనియర్ నాయకుడు వీరేశం, సీఐటీయూ గండిపేట కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. ఈ మేరకు అనుమతి కోసం శుక్రవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... 48 గంటల పాటు అన్ని మున్సిపల్ ఆఫీసుల ముందు ధర్నా అనంతరం సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. ఉపాధ్యక్షులు సురేష్, నవీన్, కోశాధికారి నరేందర్, సి.హెచ్.వెంకటేష్, జగన్‌మోహన్‌రావు, మల్లేష్, సుభాష్, రామాంజనేయులు, శ్రీధర్, తౌఫిక్, కృష్ణ, సి.హెచ్.రాము, లక్ష్మీనారాయణ, నర్సింహ్మ, జనార్ధన్‌రెడ్డి, మహిపాల్, హైమద్, శ్రీధర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

చిత్రపురి అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలి

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

మణికొండ: చిత్ర కార్మికుల కోసం కేటాయించిన గృహాలలో అనేక అక్రమాలకు పాల్పడి వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపిన పాలక కమిటీపై సీబీఐ విచారణ చేసి నిందితులను జైలుకు పంపాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చిత్రపురిలో పర్యటించారు. అందులో సభ్యులకు జరిగిన కేటాయింపులు జరిగిన అక్రమాలు, నివసిస్తున్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అనేక అక్రమాలు జరిగాయని, గత ప్రభుత్వాలలోని ముఖ్యులు సైతం అందిన కాడికి దండుకుని వారికి మద్దతు ఇచ్చారన్నారు. నిజమైన లబ్ధిదారులకు దక్కాల్సిన గృహాలను ఇష్టారాజ్యంగా కేటాయింపులు, అమ్మకాలు జరిపి కమిటీ సభ్యులు కోట్లకు పడగలెత్తారన్నారు. అలాంటి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకునేందుకు సీబీఐ విచారణ జరపాల్సిందేనన్నారు. అందుకు తమ పార్టీ తరఫున పోరాటం చేయటంతో పాటు సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. సినీ నిర్మాత మద్దినేని రమేష్, ఆప్ యువజన విభాగం అధ్యక్షుడు విజయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు యమునాగౌడ్, డాక్టర్ విభాగం అధ్యక్షుడు లక్ష్యనాయుడు, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్‌లు పాల్గొన్నారు.



చిత్రపురిలో నిర్మాణాలను పరిశీలించిన నాయకులు

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్త ఇతర వ్యర్థాలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో ప్రధాన రహదారి స్వీపింగ్, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, 12వ డివిజన్ హిమాయత్‌సాగర్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలను చెత్తాచెదారాలతో నింపవద్దు అన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మీర్జా తౌఫిక్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.


హిమాయత్‌సాగర్‌లో చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర